నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 సోమవారం 15 ఏప్రిల్ 2024 MULUGU JAYASHANKAR BHUPALPALLY



తోపులాడుకుంటున్న ఇరువర్గాల కాంగ్రెస్ శ్రేణులు

కలహాలు, గ్రూపు రాజకీయాలకు కేరాఫ్ అయిన కాంగ్రెస్‌లో వర్గపోరు మరోసారి బయటపడింది. ఆదివారం పరకాలలో నిర్వహించిన కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశం ఇందుకు వేదికైంది. 'కొండా వద్దకు వెళ్లే వారు తన దగ్గరికి రావద్ద'ంటూ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కొండా వర్గీయులకు ఆగ్రహం తెప్పించగా, ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పార్టీలో కొండా అనుచరులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ సభావేదిక వైపు దూసుకెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. శాంతించాలని వేదికపై నుంచి ఎమ్మెల్యేలు చెప్పినా ఎవరూ పట్టించుకోకపోగా, జైకొండా అని నినదించిన కాంగ్రెస్ నేత గజ్జి విష్ణును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లోక్‌సభ అభ్యర్థి గెలుపు కోసం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం కాస్తా గ్రూప్ వార్‌తో రసాభాసగా మారి అర్ధాంతరంగా ముగిసింది.

– పరకాల, ఏప్రిల్ 14

# కాంగ్రెస్‌లో గ్రూప్ వార్..

## మరోసారి బయటపడ్డ వర్గపోరు | పరకాల సభలో దుమారం రేపిన రేవూరి వ్యాఖ్యలు

- కొండా వద్దకు వెళ్లే వాళ్లు తన దగ్గరికి రావద్దనడంపై భగ్గుమన్న కొండా వర్గీయులు
- ఎమ్మెల్యేల ముందే ఇరువర్గాల తోపులాట.. జైకొండా నినాదాలతో వేదికపైకి దూసుకెళ్లే ప్రయత్నం
- సభావేదిక వద్ద ఉద్రిక్తత, గందరగోళం.. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం రసాభాస
- పోలీసుల అదుపులో గజ్జి విష్ణు.. దేవరుప్పలలో ఝాన్సీరెడ్డి, పెద్ది కృష్ణమూర్తి మధ్య 'చేరికల గొడవ'



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పరకాల శివారులో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక లలిత కన్వెన్షన్ హాల్‌లో ఈ సమావేశం ఏర్పాటు చేయగా పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు యశస్వినీరెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కడియం శ్రీహరితో పాటు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, అభ్యర్థి కడియం కావ్య హాజరయ్యారు. సమావేశం జరుగుతున్న క్రమంలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి 'కొండా వద్దకు వెళ్లే పార్టీ శ్రేణులు తన వద్దకు రావద్దు' అంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీంతో అక్కడున్న పలువురు కొండా వర్గీయులు జై కొండా, జిల్లా టైగర్ కొండా మురళి అంటూ సభా వేదిక మీదకు దూసుకెళ్లే ప్రయత్నం చేయగా మరో వర్గం శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సభా వేదికపై నుంచి పలువురు ఎమ్మెల్యేలు శాంతించాలని సూచించినా పెడచెవిన పెట్టారు. కాగా జై కొండా అంటూ నినాదాలు చేసిన గజ్జి విష్ణు అనే నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహించిన విష్ణు వర్గీయులు స్టేషన్ ముందు పోలీసులకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు.

### వర్గపోరుతో మరోసారి ముగిసిన సభ

కాంగ్రెస్‌లో గ్రూప్ వార్ మరోసారి బహిర్గతమవ్వడం చర్చనీయాంశమైంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ వద్ద జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో గ్రూపు రాజకీయాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో కొండా మురళీధర్‌రావు మీసం తిప్పడం, ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి తొడ కొట్టడం, ఇరువర్గాల శ్రేణులు నినాదాలు చేయడంతో పరిశీలకులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో అప్పటి సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. కాగా ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో మరోసారి గ్రూప్ వార్ బహిర్గతమైంది. ఇందులో కొండా వర్గీయులైన తమను చిన్నచూపు చూస్తున్నారంటూ పలువురు ఎమ్మెల్యేలు, అభ్యర్థి ముందే నిరసన చేయడంతో సమావేశం కాస్తా గ్రూపు రాజకీయాలకు వేదికగా మారింది.



గజ్జి విష్ణును స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

### మంత్రి కొండా గైర్హాజరు

కాగా పరకాల నియోజకవర్గ సమావేశానికి మంత్రి కొండా సురేఖ హాజరవుతారని నిర్వాహకులు ప్రకటించారు. దీంతో మంత్రి కొండా వర్గీయులు పెద్ద ఎత్తున సమావేశానికి తరలివచ్చారు. తీరా సభకు మంత్రి గైర్హాజరు కావడం, మంత్రిపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం లేపాయి. పరకాల నియోజకవర్గానికి తెలియని రేవూరిని ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కొండా దంపతులు అహర్నిశలు కృషి చేశారని, వారి కృషితోనే ఎమ్మెల్యేగా గెలిచి, తీరా గెలిచిన తర్వాత కొండా దంపతుల పట్ల ఇలా వ్యవహరించడం తగదని పలువురు కార్యకర్తలు చర్చించుకున్నారు.



దేవరుప్పలలో గొడవకు దిగిన పెద్ది కృష్ణమూర్తి వర్గం

### దేవరుప్పలలో ఝాన్సీరెడ్డి X పెద్ది

**చేరికలను వ్యతిరేకిస్తూ కృష్ణమూర్తి వర్గం గొడవ**

**మాకు చెప్పకుండా ఎలా చేర్చుకుంటారని నిలదీత**

దేవరుప్పుల, ఏప్రిల్ 14: కాంగ్రెస్ పార్టీలో గ్రూపుల పోరు మరోసారి భగ్గుమంది. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో ఆదివారం కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో ఇరువర్గాలు గొడవపడ్డాయి. సమావేశంలో దేవరుప్పుల, కామారెడ్డిగూడెం, గొల్లపల్లి, ధర్మాపురం, ధర్మగడ్డ తండాల్లోని బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి వర్గానికి చెందిన 30 మంది నాయకులు తమను సమావేశానికి ఎందుకు పిలవలేదని, తమను సంప్రదించకుండా తమ గ్రామాల్లోని వారిని పార్టీలో ఎలా చేర్చుకుంటారని నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ పెరగడంతో పోలీసులు జోక్యం చేసుకొని పెద్ది అనుచరులు తోటకూర రమేశ్, అనిల్, ప్రకాశ్‌తో పాటు 15మందిపై కేసు నమోదు చేశారు.



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్

# థాంక్యూ సర్..

**వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చినందుకు కేసీఆర్‌కు సుధీర్ కృతజ్ఞతలు**

హనుమకొండ, ఏప్రిల్ 14 : హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్ ఆదివారం పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిత్వం ఖరారు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



తొర్రూరులోని దవాఖానలో చికిత్స పొందుతున్న అక్బర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# అధికార అహంతో దాడులు సిగ్గుచేటు

- చర్యలు తీసుకోకుంటే పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు, ఏప్రిల్ 14: అధికార అహంతో కాంగ్రెస్ నేతలు ప్రతిపక్షాల కార్యకర్తలపై దాడులకు తెగబడడం సిగ్గు చేటని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. తొర్రూరు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన రైతు, బీఆర్‌ఎస్ కార్యకర్త ఎండీ అక్బర్‌పై కొంత మంది కాంగ్రెస్ నాయకులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి తొర్రూరులోని ఓ దవాఖానలో చికిత్స పొందుతుండగా, దయాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ కార్యకర్త అక్బర్ చెరువు కుంట నుంచి మొరం మట్టిని తన వ్యవసాయ భూమిలో పోసుకుంటే, ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సోమిరెడ్డి, వెంకటేశ్వర్లు మొరం తీసుకుపోవాలంటే కాంగ్రెస్ పార్టీలో చేరాలంటూ భౌతిక దాడులు చేసి గాయపరచడం బాధాకరమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఎక్కడ ఎలాంటి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడలేదని వాపోయారు. అధికార అహంకారంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎస్పీ, డీఎస్పీలు స్పందించి విచారణ చేపట్టి దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, రామసహాయం కిశోర్‌రెడ్డి, అంకూస్, ప్రమోద్, రామలింగం, ఐలయ్య ఉన్నారు.

# గొర్రెల కాపరి సాహసం

**చెరువులో మునిగిన బండిఎడ్లు, ఆవు, తాతా మనువడు**

**కాపాడిన గొర్రెల కాపరి.. ఆవు మృతి**

కేసముద్రం, ఏప్రిల్ 14 : చెరువులో మునిగిన ఎడ్లు, తాతా మనవడిని గొర్రెల కాపరి సాహసం చేసి కాపాడిన ఘటన కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పుణ్యపుర్తి అయిలయ్య, ఆయన మనుమడు అశ్విత్ ఎడ్లబండిపై ఆదివారం సాయంత్రం వ్యవసాయ భూమి నుంచి ఇంటికి వస్తున్నారు. ఎడ్లబండికి వెనకాల ఆవును తాడుతో కట్టారు. ఎడ్లకు నీళ్లు పెట్టడానికి స్థానికంగా ఉన్న చెరువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడే జేసీబీతో తీసిన గుంత కనిపించక బండి ఎడ్లు, ఆవు, రైతు అయిలయ్య, మనుమడు అశ్విత్ నీటిలో మునిగిపోయారు. అక్కడే గొర్రెలను మేపుతున్న గొర్రెల కాపరి గమనించి అయిలయ్య, అశ్విత్, ఎడ్లను గుంతలో నుంచి బయటకు తీసుకొచ్చాడు. ఆవు మాత్రం నీటిలో మునిగి మృతి చెందింది. గొర్రెల కాపరి విజయ్ సాహసం చేసి రైతు అయిలయ్య, అశ్విత్, ఎడ్లను కాపాడడంతో గ్రామస్తులు అతడిని అభినందించారు.



చెరువు వద్ద మృతి చెందిన ఆవు, ప్రాణాలతో బయటపడ్డ అయిలయ్య, మనుమడు అశ్విత్
ఇన్‌సెట్‌లో గొర్రెల కాపరి విజయ్



ఆటో టాప్‌లో ఏర్పాటు చేసిన గడ్డిగులాబీ, ఇతర మొక్కలు

# గ్రీన్ ఆటో.. కూల్ జర్నీ

**మానుకోట ఆటోడ్రైవర్ వినూత్న ఆలోచన**

నర్సంపేట, ఏప్రిల్ 14 : ఎండలు మండిపోతున్నాయి. జనం మధ్యాహ్నం బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఎక్కువ మంది ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు చూసుకుంటున్నారు. కార్లలో ఏసీ ఉన్నందున ఎప్పుడైనా వెళ్తారు. కానీ సామాన్యులు మధ్యాహ్నం వేళల్లో ఆటోల్లో వెళ్లడం లేదు. దీంతో ఆటోడ్రైవర్లకు గిరాకీ తగ్గింది. ఈ క్రమంలో ఓ ఆటోడ్రైవర్ వినూత్న ఆలోచన చేశాడు. ఆటోకు టాప్‌లో గడ్డి గులాబీ, ఇతర మొక్కలను ఏర్పాటు చేశాడు. అవి ఎండిపోకుండా పైన షేడ్ నెట్ కట్టాడు. ఆటోపై ఎండ ప్రభావం లేకుండా గ్రీన్ ఆటో తయారు చేసుకున్నాడు. ఈ ఆటోను మహబూబాబాద్ జిల్లాకు చెందిన భూక్యా అంజి రోడ్లపై తిప్పుతున్నాడు. నర్సంపేట రోడ్లపై ఈ ఆటోలో ప్రయాణికులను తీసుకువెళ్తున్నాడు.

# నమ్మకద్రోహానికి మారుపేరు కడియం

**ఎంతో మంది ఎదుగుదలను అడ్డుకున్న వ్యక్తి శ్రీహరి**

**ఎంపీ ఎన్నికల్లో కావ్య ఓటమి ఖాయం**

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

పరకాల, ఏప్రిల్ 14 : నమ్మక ద్రోహానికి మారుపేరు కడియం శ్రీహరి అని, తన రాజకీయ జీవితంలో ఎంతో మంది ఎదుగుదలను అడ్డుకొని పైకి వచ్చారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధానిలో అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పదవులన్నీ అనుభవించి పార్టీ అధికారం కోల్పోగానే పార్టీని వీడడం కడియం చిత్తశుద్ధిని తెలియజేస్తున్నదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణలో ఎంతోమందిని రాజకీయంగా ఎదగకుండా శ్రీహరి అడ్డుకున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కావ్యకు ఓటు వేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా లేరని, ఆమె ఓటమి ఖాయమన్నారు. రేవంత్ ప్రభుత్వం గ్యారెంటీల అమలు గురించి ఆలోచించకుండా రాజకీయాలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని, ఉద్యమకారులు, పార్టీ శ్రేణులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పార్టీకి ద్రోహం చేస్తే ఊరుకునేది లేదని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు మడికొండ శ్రీనును సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చందుపట్ల రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, నిప్పాని సత్యనారాయణ, బండి సారంగపాణి, చందుపట్ల తిరుపతి రెడ్డి, గందె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



ధ్వంసం చేసిన డీబీఎం–38 ఎస్సారెస్పీ 17ఎల్ ఉపకాల్వ సీసీ, కల్వర్టును చూపుతున్న రైతులు

# ఎస్సారెస్పీ ఉపకాల్వలు కబ్జా


**కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు అందించని ఫలితం**

**జేసీబీతో డీబీఎం-38 17ఎల్ ఉపకాల్వ కూల్చివేత**

**వ్యవసాయ భూమిగా మార్చుకునేందుకు యత్నం**

**20 సిమెంట్ పైపులను తెప్పించిన రైతు**

నల్లబెల్లి, ఏప్రిల్ 14: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని డీబీఎం–38 ఎస్సారెస్పీ 17ఎల్ ఉపకాల్వను ఓ రైతు పూడ్చేసి వ్యవసాయ భూమిగా మార్చుకుంటున్నాడు. ఈ మండలంలో సాగునీటి కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయలతో డీబీఎం–38 ఎస్సారెస్పీ ఎడమ కాల్వను నిర్మించింది. ఇదే కెనాల్ ద్వారా అనేక చెరువులను నింపేందుకు 17ఎల్, 11ఆర్ ఉపకాల్వలను నిర్మించింది. కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల పాటు కెనాళ్లు, ఉపకాల్వల ద్వారా పంటలకు సాగునీరు సమృద్ధిగా సరఫరా చేసిన విషయం విదితమే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల నుంచి సాగునీరు అందడం లేదు. దీంతో రంగాయచెరువు కెనాళ్లు, ఉపకాల్వలతో పాటు ఎస్సారెస్పీ డీబీఎం–38 17ఎల్, 11ఆర్ ఉపకాల్వలను కొందరు పూడ్చేసి వ్యవసాయ భూములుగా మార్చుకుంటున్నారు. లెంకలపల్లి శివారు కుమ్మరిమడుగు సమీపంలో రైతు పేరాల పెద్ద రాజు, మరికొందరు రైతులు జేసీబీతో 17ఎల్ ఉపకాల్వపై ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన కల్వర్టు, సీసీని ధ్వంసం చేశారు. కాల్వలో వేసేందుకు 20 సిమెంట్ పైపులు తెప్పించారు. దీంతో ఆయకట్టు రైతులు బత్తిని రవి, నానెబోయిన కుమారస్వామి, పిట్టల రాజు, మంద రాజు, నర్సయ్య, తొర్రూరు రామన్న, గుండెకారి చందర్, కిషన్, మేకల పైడి, ముప్పారపు రాజయ్య, పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఎస్సారెస్పీతో పాటు రంగాయచెరువు ఉపకాల్వలు భవిష్యత్తులో అంతరించిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఇరిగేషన్ శాఖ డీఈ రవిని వివరణ కోరగా కాల్వ పూడ్చివేసిన రైతులపై చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



డీబీఎం–38 ఎస్సారెస్పీ 17ఎల్ ఉపకాల్వను ధ్వంసం చేస్తున్న జేసీబీ